సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



గూడ్స్ రైలులో మంటలు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో ఒడిశా నుంచి బొగ్గుతో వస్తున్న గూడ్స్ రైలులో మంగళవారం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు.



జాతీయ షాట్‌పుట్ పోటీలకు దివ్య

ఇచ్ఛాపురం రూరల్: పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎం.తోటూరు సత్యసాయి పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి దివ్య ఎంపికైంది. విద్యార్థినిని మంగళవారం అభినందించారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

నరుబుజ్జిలి: వెన్నెలవలన జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు సవరణల కోసం 16, 17వ తేదీల్లో అవకాశం కల్పించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

11న నవోదయ 9వ తరగతి ప్రవేశ పరీక్ష

నరుబుజ్జిలి: వెన్నెలవలన జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 11న జవహర్ నవోదయ, వెంకటసాయి విద్యాసంస్థల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హాల్ టికెట్ నంబర్ 106899 నుంచి 107282 వరకు వెన్నెలవలన వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో, హాల్‌టికెట్ నంబర్ 107283 నుంచి 107584 వరకు నరుబుజ్జిలి వెంకటసాయి హైస్కూల్‌లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11 ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు జరుగుతుందని వెల్లడించారు. సకాలంలో ఆయా కేంద్రాలకు విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

పర్యాటక కేంద్రానికి 17 ఎకరాలు



పొన్నాడ కొండ ప్రభుత్వ భూముల రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ కొండ సర్వే నంబర్ 86-1 ప్రభుత్వ భూమిని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మంగళవారం పరిశీలించారు. మొత్తం 17 ఎకరాలు పర్యాటక కేంద్రానికి కేటాయించారు. ఈ భూమిని మండల సర్వేయర్ తమ్మయ్య స్వామి, సచివాలయ సర్వేయర్లు లింగరాజు, కొయ్యాన అశోక్‌లతో కూడిన బృందం సర్వే నిర్వహించింది. హద్దులు నిర్ణయించాలని జేసీ సూచించారు. హద్దులు నిర్ణయించి భూములు అప్పగిస్తే పర్యాటక కేంద్ర పనులు ప్రారంభిస్తామని జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు చెప్పారు. ఈ సంస్థలకు ఆనుకొని మరో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, ఈ స్థలం సైతం అప్పగించాలని జేసీ దృష్టికి తీసుకు రాగా, పరిశీలిస్తామని ముందుగా 17 ఎకరాలు భూ కేటాయింపులు చేస్తున్నట్లు చెప్పారు. పొన్నాడ కొండ సమగ్ర సర్వే నిర్వహించాలని తహసీల్దార్ సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టూరిజం అధి కారి రమేష్, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పంచిరెడ్డి కృష్ణారావు, వీఆర్వో ధర్మపురం పాల్గొన్నారు.

ఉపాధే లక్ష్యంగా శిక్షణ



శిక్షణ పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పర్యవేక్షకులు

ఎచ్చెర్ల క్యాంపస్: యువతకు ఇస్తున్న నైపుణ్య శిక్షణలు ఉపాధి లక్ష్యంగా సాగాలని కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలకులు గిరిజాశంకర్ పాడే, సత్యరంగారావు అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయు-జీకేవై) కింద ఎచ్చెర్ల స్కిల్ కాలేజ్ (జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం)లో కొనసాగుతున్న స్వయం ఉపాధి శిక్షణలను మంగళవారం పరిశీలించారు. స్థానికంగా పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్, సేల్స్ అసోసియేట్, సూయింగ్ మిషన్ ఆపరేటర్ కోర్సులు కొనసాగుతుండగా, 105 మందికి శిక్షణ ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు శిక్షణ నాణ్యత, వసతి గృహం నిర్వహణ, భోజన నాణ్యత, మౌలిక వసతులు, విద్యార్థుల్లో నైపుణ్యాలు, చేస్తున్న కోర్సు, కోర్సు తర్వాత చేయనున్న ఉద్యోగంపై అవగాహన వంటి అంశాలను తెలుసుకున్నారు. శిక్షణ అనంతరం యువతకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అందరూ ఉద్యోగాల్లో చేరేలా ప్రేరణ కలిగించాలని శిక్షకులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతను గుర్తించి ప్రతి ఒక్కరికీ శిక్షణ, ఉపాధి లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగాలని అన్నారు. ప్రధానంగా 10వ తరగతి నుంచి విద్యార్హత ప్రామాణికంగా తీసుకొని శిక్షణలు ఇవ్వాలని అన్నారు. మహిళలకు ఇంటి వద్ద ఉండి సైతం ఆదాయం సముపార్జించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ డీవీ విద్యాసాగర్ శిక్షణలు నిర్వహిస్తున్న తీరు, ప్లేస్‌మెంట్‌ల కల్పనపై కేంద్ర పథకాల పర్యవేక్షకులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ చిట్టిరాజు, స్వీడాప్ జాబ్స్ మేనేజర్ సనపల వెంకటరమణ మూర్తి పాల్గొన్నారు.

కళ్లముందే కూలిపోతుంటే..



‘మేముంటున్న ప్రాంతానికి కొద్దిదూరంలోనే భూకంపం సంభవించింది. జీవితంలో ఇంత వరకు ఇలాంటి విపత్తు చూడలేదు. కాళ్ల కింద నేల కంపించి, కళ్లముందే భారీ భవంతులు పేకమేడల్లా కూలిపోతుంటే దిక్కుతోచని పరిస్థితి. తీవ్ర భయాందోళనకు గురయ్యాం. అయితే కంపెనీ కేటాయించిన వసతి భవనాల వరకు భూకంప ప్రభావం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాం.’

–ఇదీ టర్కీ భూకంపం నుంచి బయటపడిన సిక్కోలు వాసుల మాట



సురక్షితంగా ఉన్న సిక్కోలు యువకులు

వజ్రపుకొత్తూరు రూరల్: టర్కీ, సిరియా సరిహద్దులో సోమవారం తెల్లవారు జామున సంభవించిన ఘోర భూకంప ఘటనలో వేలాది మంది మృత్యువాత పడ్డారు. అదే ప్రాంతంలో గల జి.మౌంట్ కంపెనీలో పని చేస్తున్న జిల్లాకు చెందిన సుమారు 180 మంది వలస యువకులు సురక్షితంగా బయటపడ్డారు. టర్కీ నుంచి బాధితులు మంగళవారం ‘సాక్షి’ ప్రతినిధితో ఫోన్‌లో తమ క్షేమ సమాచారం తెలిపారు. ఉద్దాన ప్రాంతం బాతుపురం గ్రామానికి చెందిన బత్తిని శ్రీను, బొడ్డపాడుకు చెందిన తామాడ శ్యామ్, పీఎం పురానికి చెందిన పుచ్చ బాలతో పాటు పలాస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన యువకులు శేఖర్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ఉత్తమ్, వెంకటరమణ, జగదీష్‌తో పాటు మరి కొంత మంది ఉన్నారు. అలాగే ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ప్రాంతానికి చెందిన మరో 150 మంది వలసజీవులు కూడా ఉన్నారు. తాము ఉన్న ప్రాంతానికి కొద్ది దూరంలో భూకంపం సంభవించిందని, తాము సురక్షితంగానే ఉన్నామని చెప్పారు. తాము ఉన్న కంపెనీ గదుల వరకు భూ కంపం ప్రభావం చూపకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డామని అన్నారు. తమను ప్రస్తుతం నగర శివార్లలోని సురక్షిత ప్రాంతాలకు తరలించారని చెప్పారు.

‘మా బాబు క్షేమంగానే ఉన్నాడు’




కుమారుడు గురుదేవ్‌తో మాట్లాడిన తల్లిదండ్రులు పాపయ్యరెడ్డి, పద్మావతి

కవిటి: టర్కీలో సంభవించిన భూకంపంలో తమ బిడ్డకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదని కవిటికి చెందిన బి.పాపయ్యరెడ్డి విలేకరులకు తెలిపారు. టర్కీలో సంభవించిన పెనువిపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో తమ బిడ్డ క్షేమం కోసం బి.పాపయ్యరెడ్డి పద్మావతి దంపతులు ఆందోళన చెందారు. అయితే ప్రమాద స్థలానికి తాను 300 కిలోమీటర్ల దూరంలో ఉన్నానని అతను ఫోన్ చేయడంతో వీరు ఊపిరి పీల్చుకున్నారు. తమ ప్రాంతానికి కూడా ముప్పు ఉందని హెచ్చరికలు వచ్చాయని తమ బిడ్డ చెప్పాడని వారు తెలిపారు.

అచ్చెన్న ఇలాకాలో

తమ్ముళ్ల కుమ్ములాట

- టెక్కలి మండలంలో రెండు గ్రూపులుగా టీడీపీ కార్యకర్తలు
- అచ్చెన్న సమక్షంలో నిమ్మాడలో పంచాయితీ
- పట్టణానికి చెందిన జూనియర్ గ్రూపు కార్యకర్తలకు అచ్చెన్న మద్దతు
- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సీనియర్ గ్రూపు కార్యకర్తలకు హుకుం
- విభేదాలు రచ్చకెక్కడంతో పార్టీలో చర్చ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ఆ పార్టీ రాజకీయం రచ్చకెక్కుతోంది. ఎప్పటినుంచో కార్యకర్తల్లో ఉన్న విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. టెక్కలి మండలంలోని సీనియర్ కార్యకర్తలు, పట్టణంలోని జూనియర్ గ్రూపుల మధ్య గత కొన్ని రోజులుగా జరుగుతున్న వివాదాలు, విభేదాలు బయటకు పొక్కడంతో కార్యకర్తల్లో ఆందోళన మొదలైంది. ఇటీవల నిమ్మాడలో అచ్చెన్న సమక్షంలో పంచాయితీ జరిగింది. ఇక్కడ అచ్చెన్న ఒకవైపే మొగ్గు చూపడంతో సీనియర్లు గుర్రుగా ఉన్నారు.

తెరవెనుక ఏం జరిగిందో..


టెక్కలి నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వం, ఫండ్ కింద పలు వర్గాల నుంచి నిధులు సేకరిస్తున్నారు. ఇందులో జూనియర్ వర్గమైన లాడి శ్రీనివాస్ తదితరులు కాస్త దూసుకుపోతున్నారు. నిధుల సేకరణలో ఆ పార్టీలో గొడవ ఏర్పడింది. ఈ విషయంలో సీనియర్ వర్గంగా ఉన్న మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషుతో లాడి శ్రీనివాస్‌కు పొరపొచ్చాలు వచ్చాయి. చినికి చినికి గాలి వానగా మారి వివాదం అచ్చెన్నాయుడు వద్దకు చేరింది.

సీనియర్లకు చిర్రెత్తేలా..

ఇటీవల నిమ్మాడలో ఇరువర్గాలతో జరిగిన పంచాయితీలో అచ్చెన్నాయుడు ఒకవైపే మొగ్గు చూపారు. గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో అచ్చెన్నాయుడికి బినామీగా ఉన్న నాయకుడు ఈ పంచాయితీలో ప్రభావం చూపించారు. ఆ బినామీ కోరిక మేరకే అచ్చెన్న సీనియర్లను విస్మరించి జూనియర్ వర్గానికి కొమ్ము కాశారు. అంతటితో ఆగకుండా సీనియర్లకు మద్దతుగా ఉన్న ఇద్దరు కార్యకర్తలను ఏకంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హుకుం జారీ చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య వైరం మరింత తారస్థాయికి చేరుకుంది.

టీడీపీలో మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారి కంటే కొత్తగా పార్టీలో చేరిన వారిపై అచ్చెన్న మొగ్గు చూపడం, వారి ఎదుటే సీనియర్ నాయకులకు మద్దతు పలికిన వారిపై అచ్చెన్న మండిపడడం మరింత వివాదాలకు దారితీస్తోంది. అచ్చెన్నాయుడు వ్యూహాత్మకంగా మరో వర్గాన్ని తయారు చేస్తున్నారని సీనియర్లు మదనపడుతున్నారు. అంతేకాకుండా అచ్చెన్న వద్ద జరిగిన పంచాయతీలో తమ మాటే నెగ్గిందని జూనియర్ గ్రూపు బయటికొచ్చి సవాల్ విసరడం, ఎగతాళి చేయడాన్ని సీనియర్లు మరింత జీర్ణించుకోలేకపోతున్నారు. జూనియర్లు చేస్తున్న హడావుడిని సీనియర్లు ఏ మాత్రం తట్టుకోలేకపోతున్నారు. విషయం ముదరడంతో ఆ తర్వాత అచ్చెన్న దూతలు సీనియర్లను బుజ్జగించేందుకు ఆరాట పడుతున్నా... ఇంకా వర్కవుట్ కాలేదు. సీనియర్లంతా మొండిగానే ఉంటూ తమ సత్తా ఏంటో చూపిస్తామంటూ శపథం చేసినట్లుగా సమాచారం. మొత్తానికి సీనియర్ నాయకుల విషయంలో అచ్చెన్న వైఖరితో గత కొన్నేళ్లుగా గుట్టు గా ఉన్న గ్రూపుల గోల ఒక్క సారిగా బహిర్గతమై నియోజకవర్గంలో రాజకీయ రచ్చకు తెరలేపింది.

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 64 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు వరకు పరీక్షలు జరగుతున్నాయి. ఈ నెల 20 వరకు పరీక్షలు జరగనున్నాయి. వర్సిటీ అఫిలియేషన్ పరిధిలో రెగ్యులర్‌గా 8112, సప్లిమెంటరీగా 8345 మంది బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఎంల నుంచి పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు.

● ధాన్యలక్ష్మీ నమస్తుభ్యం..



ఎండకు ఎండి, వానకు తడిచి, పైరును పసిపాపలా చూసుకుని, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి ఆరుగాలం కష్టపడితే.. ధాన్యలక్ష్మి కటాక్షం కర్షకుడికి లభిస్తుంది. ఈ శ్రమకు, ప్రతిఫలానికి కృతజ్ఞతగా రైతులు కళ్లంలో ధాన్యపు రాశులకు పూజలు చేస్తారు. ఆకుల్లో బెల్లం జావ, పప్పు ప్రసాదం, అట్లు, నెయ్యిముద్దలు, పత్రిపూలు, పసుపు కుంకుమలు ఉంచి కృతజ్ఞత చెప్పే అపురూప సంప్రదాయం సిక్కోలులో కనిపిస్తుంది. పలాస మండలం బొడ్డపాడులో ఈ చిత్రం చిక్కింది. – కాశీబుగ్గ

జిల్లా జైలు సందర్శన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

గార: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అమ్మద్ మౌలానా ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం అంపోలులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముద్దాయిలకు అందుతున్న భోజన, ఇతర వసతి సదుపాయాలను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. మహిళా ఖైదీలందరితోనూ మాట్లాడి వారి కేసు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేనివారు ఉంటే న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని, న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా కేసు నడిపించేందుకు న్యాయవాదిని నియమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్‌నాయుడు, న్యాయవాది ఇందిరాప్రసాద్, ఇతర జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక రిమ్స్ వద్ద ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను సివిల్ జడ్జి సందర్శించి సెంటర్ పని తీరును అడిగి తెలుసుకున్నారు.

బతుకులు బాగు చేసే ఇంట్రస్టు

ఈ నెల ఓ వెయ్యి రూపాయలు ఎక్కువ ఉంటే బాగుండేది.. వచ్చే నెల ఎలాగైనా ఇంకొంచెం డబ్బులు పొదుపు చేయాలి. పిల్లాడి స్కూల్ ఫీజు కు కొంత దాయాలి. అమ్మో పండగలు వచ్చేస్తున్నాయి.. డబ్బులు సరిపోతాయో లేదో.. సగటు మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ఇళ్లలో నిత్యం తిరుగాడే ఆలోచనలివి. ఇలాంటి సమస్యలకు సమాధానమే మహిళల స్వయం ఉపాధి. మధ్య తరగతి జీవుల కలలు నెరవేరాలంటే పురుషుడి సంపాదన ఒక్కటే సరిపోదు. అందుకే గృహిణులు స్వయం ఉపాధి వైపు చూస్తున్నారు. అలాంటి వారికి రెడ్ క్రాస్ మగటపల్లి రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు అండగా నిలుస్తోంది. కుట్టు శిక్షణ ఇస్తూ.. వారి ఉపాధికి దోహదపడుతోంది.



టైలరింగ్, కుట్టు శిక్షణలో మహిళలు



మగ్గం వర్కు చేస్తున్న యువతి

- కుట్టు శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి
- ప్రోత్సహిస్తున్న రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని రామకృష్ణ థియేటర్ ఎదురుగా ఉన్న కమలానివాస్ వద్ద మగటపల్లి రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాంతా కుట్టు శిక్షణ కేంద్రం ఎంతో మంది మహిళలకు జీవితంపై భరోసా ఇస్తోంది. ఇక్కడ మహిళలకు ఉచితంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్కు, క్లాత్ పెయింటింగ్, వర్లి బ్లాక్ పెయింటింగ్ తదితర అంశాలను నేర్పుతున్నారు. 2008లో మొదటి సారిగా దీన్ని ప్రారంభించారు. 15 కుట్టు మిషన్లు ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తూనే ఉన్నారు.




వర్లీ డిజైన్లు వేసే బ్లాకులు

మూడు వేల మందికి ఉపాధి

ఇప్పటివరకు ఈ ట్రస్టు వారు దాదాపు మూడు వేల మందికి ఉచితంగా కుట్టు శిక్షణ అందించారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు కనీసం రోజుకు రూ.500లు సంపాదిస్తున్నారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కొంతమంది **ఇక్కడ అద్దెకు ఇళ్లను కూడా తీసుకుని** నేర్చుకుంటున్నారు.

మూడు నెలలు శిక్షణ

- ఇక్కడ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్కు, పెయింటింగ్‌లలో శిక్షణ ఇస్తున్నారు.
- టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోసం మూడు**నెలలు** తర్ఫీదు ఇస్తారు.
- ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల **నుంచి 1** గంట వరకు శిక్షణ ఇస్తున్నారు. ఆ సమయంలో గౌన్లు, గాగ్రా చోళీ, పంజాబీ డ్రెస్సులు, బ్లౌజ్‌లు, మోడల్ బ్లౌజ్‌లు కటింగ్, కుట్టడం నేర్పుతున్నారు.
- ఎంబ్రాయిడరీలో గొలుసు కుట్టు, ముద్ద కుట్టు, కాడ కుట్టు, ముడి కుట్టు నేర్పుతున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 50మంది శిక్షణ పొందుతున్నారు.
- మగ్గం వర్క్, క్లాత్ పెయింటింగ్ కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఇందులో త్రెడ్ వర్కు, చిప్స్ వర్కు, క్లాత్ పెయింటింగ్, వర్లీ బ్లాక్ పెయింటింగ్‌లు నేర్పిస్తున్నారు.



మగ్గం వర్కుచేసిన బ్లౌజులు

వృత్తి శిక్షణ **నైపుణ్యం** గల ఇద్దరు **టీచర్లు** పనిచేస్తున్నారు. టైలరింగ్ కోసం వచ్చిన మహిళలు మగ్గం వర్కు నేర్చుకోవడంపై కూడా శ్రద్ధ చూపిస్తున్నారు. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉండడం వల్ల ఆదాయం కూడా లభిస్తోంది.

ఇంకా ఎన్నో..

మగటపల్లి రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ ట్రస్టు సభ్యులంతా కలసి శాంతా కుట్టుశిక్షణ కేంద్రం, అనాథ పిల్లలకోసం శాంతా కల్యాణ్ అనురాగ నిలయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పాతబస్టాండు వద్ద మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం కోసం ఒక భవనాన్ని నిర్మించారు. ఇటీవల రథసప్తమి నుంచి కాశీ అన్నపూర్ణ వితరణ పేరుతో ప్రతి రోజు 100 మంది పేదలకు అన్నదానం చేసే కార్యక్రమంలో కూడా భాగస్వామ్యమయ్యారు.

ఎందరికో ఉపాధి



ఈ ట్రస్టు వల్ల ఎంతో మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ విద్య నేర్చుకొని తమ స్వశక్తితో జీవనం సాగిస్తున్నారు. నేర్చుకునే వాళ్లు కూడా శ్రద్ధతో నేర్చుకుంటున్నారు. – పి.సంతోషి, టీచర్

మాకు ఎంతో ఉపయోగం



ఇక్కడ బాగా నేర్పుతున్నారు. మా పక్క ఊరిలో నాకు తెలిసిన స్నేహితురాలు చెప్పగా వచ్చాను. టైలరింగ్ తోపాటుగా మగ్గం వర్క్ కూడా నేర్చుకుంటున్నాను. మాకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. – జి.విజయలక్ష్మి, బొంతలకోడూరు

‘తుఫాను వస్తేనే పని చేస్తారా..?’



సమీక్షిస్తున్న సీఎండీ సంతోషరావు. పక్కనే డైరెక్టర్లు సూర్యప్రతాప్, చంద్రుడు

అరసవల్లి: ‘విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండని రైతు దరఖాస్తు చేసుకుంటే.. వాటిని పరిశీలించి ఇవ్వడానికి మీకు వచ్చిన ఇబ్బందులేంటి..? ఎందుకు సకాలంలో పెండింగ్‌లను క్లియర్ చెయ్యడం లేదు? మీరంతా సైక్లోన్లు అప్పుడే పనిచేస్తారా. మిగిలిన సమయాల్లో పనిచెయ్యరా...? అంటూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కె.సంతోషరావు స్థానిక విద్యుత్ ఇంజినీర్ల తీరుపై మండిపడ్డారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష కార్యక్రమంలో ఆయన పలువురు ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో జారీ చేయడంలో కొన్ని మండలాల బాధ్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల అంశంపై సమీక్షించారు. ఎస్‌పీడీసీఎల్‌లో పెండింగ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఎప్పటికప్పుడు జారీ చేశారని, ఈపీడీసీఎల్‌లో మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. ఫీడర్ అంతరాయాలను తగ్గించడంలో సర్కిల్ బాగా పనిచేసిందని ఎస్ఈ దైవప్రసాద్‌ను అభినందించారు. సమావేశంలో ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరక్టర్ ఎ.వి.సూర్యప్రతాప్, ఫైనాన్స్ డైరక్టర్‌డి.చంద్రుడు, సీజీఎం విజయలలిత పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం రూరల్ పరిధిలో పాత్రునివలసలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్‌లో విద్యుత్ ఏర్పాటు పనులను సీఎండీ బృందం పరిశీలించింది. దాదాపుగా విద్యుత్ లైనింగ్ పనులన్నీ పూర్తయ్యాయని స్థానిక అధికారులు వివరించారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

శ్రీకాకుళం క్రైం: పట్టణంలోని జెండాల వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 1350 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు అంధవరపు లక్ష్మణరావు ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన రూ.51,300 విలువైన బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ అశోక్, రామ్మోహన్, ఈశ్వర్, నారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి షరీఫ్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



షీల్డ్, ప్రశంసాపత్రంతో భాగ్యలక్ష్మి

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సంపతిరావు భాగ్యలక్ష్మి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జనార్దనరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 5వన విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో 65 కేజీల విభాగంలో విజేతగా నిలిచినట్లు చెప్పారు. భాగ్యలక్ష్మిని డీవీఈవో కోట ప్రకాశరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆలయాలు ఆధ్యాత్మిక వికాస కేంద్రాలు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

ఇచ్ఛాపురం: ఆలయాలను ఆధ్యాత్మిక వికాస కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ప్రాంతీయ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని జగన్నాథ స్వామి దేవాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ బి.రామారావు, ఎండోమెంట్ సూపరింటెండెంట్ ఎస్‌వీజీ కుమార్, ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఆహ్వానం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా పారామెడికల్ డిప్లమో కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ ప్రిన్సిపాల్ వెంకటాచలం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ ఇమియాలజీ టెక్నీషియన్, ఆప్తాలమిక్ అసిస్టెంట్, డయాలసిస్ టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, ఆప్తమేటరీ టెక్నీషియన్, రేడియాగ్రాఫిక్ అసిస్టెంట్, కార్డియాలజీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, ఎనస్తీషియా టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, ఆడియోమీటరీ టెక్నీషియన్ వంటి వాటిలో డిప్లమో కోర్సులు ఉన్నాయి. వీటిలో భర్తీ కాకుండా ఉండిపోయిన సీట్లకు నేరుగా దరఖాస్తులను తీసుకుంటున్నారు. ఇంటర్మీడియెట్ పాసైన వారు అర్హులని, ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

రిజిస్ట్రేషన్‌తో భరోసా

- ఆస్తులకు చట్టభద్రతనిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ
- పథకాలు వర్తించాలన్నా రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- 'సాక్షి'తో జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు



పంట పొలం



జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజల ఆస్తులకు భరోసా కల్పించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ ఎంతగానో కృషి చేస్తోందని జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు అన్నారు. ప్రతి ఒక్కరూ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రశాంతంగా ఉండవచ్చని చెప్పారు. బ్యాంకుల నుంచి రుణసదుపాయం పొందేందుకు, చట్టపరమైన భరోసా, తగాదాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు దస్తావేజులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. మంగళవారం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు.

బహుళ ప్రయోజనాలు...

- స్థిరాస్థి వివాదాల్లో న్యాయస్థానంలో ఎవిడెన్స్‌గా పరిగణించాలంటే దస్తావేజు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలి.
- దీనివల్ల చట్టపరమైన భద్రత ఏర్పడుతుంది. రుణ సదుపాయం లభిస్తుంది.
- వారసత్వ హక్కులు సిద్ధిస్తాయి. భవిష్యత్తులో వారసుల మధ్య ఎటువంటి భూ సంబంధిత తగాదాలు, అపోహలు, అంతరాయాలకు అవకాశముండదు.
- సర్వే నంబర్ హద్దులు, విస్తీర్ణం నమోదు చేయడం వల్ల భూ యాజమాన్య హక్కులను పొందేందుకు, కచ్చితత్వంతో కూడిన హక్కుపత్రాలు లభ్యమయ్యేందుకు అవకాశం ఉంటుంది.
- భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నందు వల్ల కచ్చితమైన కొలతలు, హద్దులు ఉన్నందువల్ల ఇరుగు, పొరుగు భూ యజమానులతో సత్సంబధాలు కలిగి ఉండేందుకు దోహదపడుతుంది.
- వ్యవసాయ పనిముట్లు, ఎరువులు వంటి వ్యవసాయ సంబంధ ఉత్పాదకాలు ప్రభుత్వం కల్పించిన మేరకు సబ్సిడీ రాయితీలు వంటివి పొందాలంటే సొంత భూ రిజిస్ట్రేషన్ పత్రాల తద్వారా 1బీ, అడంగల్ అవసరమనే విషయాన్ని గమనించాలి.
- ప్రభుత్వ, ప్రైవేటుపరమైన అన్ని రకాల బ్యాంకింగ్, ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ సంస్థల వద్ద మన భూ పత్రాలను సెక్యూరిటీగా డిపాజిట్ చేసి అవసరం మేరకు రుణాలను పొందవచ్చు.
- సాల్వేన్సీ సర్టిఫికెట్ తొందరగా పొందేందుకు అవకాశముంటుంది.
- వంశపారంపర్యంగా, పారీకత్తుల ద్వారా లేదా బహుమతి ద్వారా లభించిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల పైన చెప్పిన అన్నిరకాల ప్రయోజనాలు పొందవచ్చు.
- వంశవృక్షము తరతరాలు ఆనందంగా, ఆరోగ్యకరమైన సంబంధాలు కలిగి ఉండాలంటే అనువంశికంగా మనకు సంక్రమించిన భూమిని ఎవరి పేరు మీద వారు రిజిస్ట్రేషన్ చేసుకుంటే మంచిది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలైన రైతు భరోసా, వ్యవసాయ రుణాలు, విద్యుత్ సబ్సిడీ, పీఎం కిసాన్ వంటివి వర్తించాలంటే లబ్ధిదారుని పేరిటే భూమి రిజిస్ట్రేషన్ చేసి ఉండాలి.
- పంట నష్ట పరిహారం రావాలన్నా, పిల్లల ఉన్నత చదువులకు రుణం కావాలన్నా, వివాహ ఖర్చుల నిమిత్తం ఇతరత్రా కుటుంబ అవసరాలు తీర్చుకునేందుకు రుణాలు పొందాలన్నా ఆస్తి మీ పేరున రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
- మన ఆస్తి మన హక్కుగా ఉంటూ భద్రత, భరోసాలు కల్పించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అనే విషయాన్ని గుర్తించాలి.

రబీ పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి



పెంట గ్రామ సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జి.సిగడాం: జిల్లాలో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జి.సిగడాం మండలంలోని పెంట, సిగడాం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంటల వివరాలను తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. సచివాలయాల ద్వారా ఉత్తమ సేవలు అందించి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం మడ్డువలస కుడి కాలువ ద్వారా ప్రవహిస్తున్న సాగునీరు అందించాలని, ఎస్సీ కాలనీ సమీపంలో గేట్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పున్నాన అక్కలనాయుడు, బత్తుల గోపి కలెక్టర్‌కు విన్నవించారు.

సేవలు భేష్..

పెంట గ్రామ సచివాలయం సిబ్బంది పనితీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణం, ధాన్యం కొనుగోలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని, ఇదే తరహాలో మిగిలిన సచివాలయాల్లోనూ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీఎం యశస్వీ ఉపకార వేతన పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన స్థానిక మోడల్ కళాశాల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, డిప్యూటీ తహసీల్దార్ నిర్మల, ఎంఈఓ అరసాగ రవి, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, సర్పంచులు ముద్దాడ ఈశ్వరమ్మ, పున్నాన సోనియా, ఏఓ యర్రా శారద, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో జిల్లాకు మొదటి స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానం కైవసం చేసుకుందని డ్వామా ప్రాజెక్టర్ డైరెక్టర్ చిట్టిరాజు వెల్లడించారు. మంగళవారం జగన్నాథవలసలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.281 కోట్ల 39 లక్షల 99 వేలతో ఉపాధి పనులు చేపట్టామన్నారు. 6 లక్షల 19 వేల మందికి పనులు కల్పించామని వెల్లడించారు. మార్చి నెలాఖరులోగా శతశాతం పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 187 కోట్లతో మెటీరియల్ పనుల కోసం నిధులు కేటాయించామని, వీటిలో రూ.137 కోట్ల మేర పనులు చేపట్టామన్నారు. మిగిలిన రూ.50 కోట్లు వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 2023–24 ఆర్థిక సంవత్సంలో రూ.584 కోట్లతో ఉపాధి పనుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. గరిష్ట వేతనం రూ.250 వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ శైలజ, ఇన్‌చార్జి ఎంపీడీఓ పూజారి రామ్మోహనరావు , ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన అప్రెంటిషిప్ లక్ష్యం



వివరాలు వెల్లడిస్తున్న డీడీ చంద్రమౌళి

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన అప్రెంటిషిప్ కల్పిస్తే విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రెనింగ్, రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రమౌళి అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో మంగళవారం వర్క్‌షాపు వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సెమినార్ హాలులో బుధవారం వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐటీఐ శిక్షకులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. రెండో రోజు గురువారం ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో వర్క్ షాపు జరుగుతుందని, ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. స్కిల్ ఇండియాలో భాగంగా పారిశ్రామిక శిక్షణ కోర్సుల్లో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగం ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు అప్రెంటిషిప్, ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. వర్క్‌షాపుల్లో నిపుణులు, పారిశ్రామికవేత్తల సలహాలు, సూచనలు స్వీకరించి ఐటీఐ కరిక్యులమ్‌లో అమలు చేస్తామన్నారు. పరిశ్రమలు ఇస్తున్న స్టైఫండ్‌తో పాటు రూ.1500 ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. కార్యమంలో ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పక్కన మృతదేహం గుర్తింపు



మృతుడు ఈశ్వరరావు

టెక్కలి రూరల్: టెక్కలిలో పాతజాతీయ రహదారి పక్కన ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. టెక్కలి ఎస్‌ఐ–2 రమేష్‌బాబు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పేరు పైల ఈశ్వరరావు(57)గా గుర్తించారు. శంభణవీధిలో ఉంటున్న ఈయన గతంలో రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడని తెలిపారు. రెండు రోజులుగా మద్యం తాగుతూ తిరుగుతుండేవాడని, నీరు, ఆహారం లేక మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేద్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు సీఎం హామీ



సీఎంను కలిసిన ధర్మాన కృష్ణదాస్, కృష్ణచైతన్య

పోలాకి/నరసన్నపేట: రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ఖరీఫ్‌లో పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చెప్పారు. తన కుమారుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్యతో కలిసి మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిశారు. జిల్లా రాజకీయాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లాలో ఇప్పటికే 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, మరో 1.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందని, వారికి నష్టం కలగకుండా చూడాలని సీఎం దృష్టికి తీసుకురాగానే, ఆయన పైవిధంగా స్పందించారని చెప్పారు. వంశధార నిర్వాసితులకు రూ.25కోట్లు నిధులు త్వరలోనే చెల్లించడంతో పాటు సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకానికి పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్ల నిధులను త్వరలోనే విడుదల చేసి మొదటిదశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ఈఏడాది చివర్లో నీటిని విడుదల చేస్తామని వివరించారు. పాతపట్నం నియోజకవర్గంలో 170 గ్రామాలకు సంబంధించి మంచినీటి వాటర్‌గ్రిడ్ పథకం పనులు సైతం వేగవంతం చేస్తామన్నారు. రూ.50 కోట్లతో నిర్మిస్తున్న పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ఇప్పటికే 70శాతం పూర్తయిందని, వచ్చే ఏడాదికి ఉద్దానం మంచినీటి పథకం అందుబాటులోకి తెచ్చేలా పనులు చేయిస్తున్నామని తెలిపారు.

సీఎంకు నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘు నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నాయీబ్రాహ్మణ కులానికి అరుదైన గౌరవం కల్పించిన తొలి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొరుపూరు గజపతిరావు, ఎస్.వి.జగన్నాథం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావుపూలే కాలనీ (కంపోస్టుకాలనీ)లో నాయీబ్రాహ్మణ సంక్షేమ భవనం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రలో ఏ రాష్ట్రంలో గుర్తించని విధంగా ఏపీలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు నియామకాల్లో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి ఒకరికి తప్పనిసరిసరిగా స్థానం కల్పించాలని నిర్ణయించడం చరిత్రాత్మకమన్నారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీచేయడం హర్షనీయమన్నారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య, మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముంగండి సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.కృష్ణారావు, దొంతుకుర్తి త్రినాథరావు మాస్టారు, సీహెచ్ కన్నయ్య నాగరాజు, వరదరాజులు, డోలు శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పిల్లలవలస విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పొందూరు: మండలంలోని పిల్లలవలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గురుగుబెల్లి ప్రియమణి అండర్–17 బాలికల విభాగంలో జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా దొనకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–17 హాండ్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.రాజశేఖరరావు తెలిపారు. ప్రియమణిని మంగళవారం హెచ్‌ఎం కాసులబాబు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థినికి తర్ఫీదునిచ్చిన పీడీ రాజశేఖర్‌ను హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

హాజరులో వ్యత్యాసాలు నిజమే

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్యశాలలో పనిచేస్తున్న ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లకు సంబంధించి ముఖ హాజరులో వ్యత్యాసాలు ఉన్నట్లు స్థానిక రిమ్స్ అధికారులు గుర్తించారు. గతంలో వీరి ముగ్గురి హాజరుకు సంబంధించి స్థానిక అధికారులకు ఫిర్యాదు అందినా సెలవుల్లో కోత విధించి తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడంతో రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో వారు సీరియస్‌గా తీసుకున్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి స్థానికంగా తీసుకున్న చర్యలతో నివేదిక పంపాలని ఆదేశించారు. దీంతో ఈ విషయంలో కదలిక వచ్చింది. మంగళవారం ప్రాథమికంగా జరిపిన విచారణలో ముఖ హాజరులో వ్యత్యాసాన్ని గుర్తించారు. ఉదయం 8 గంటలకు డ్యూటీకి వచ్చినట్లు నమోదు కాగా రాత్రి 8 గంటలకు విధుల నుంచి వెళ్లినట్లు కొన్ని రోజులు నమోదై ఉండగా, మరికొన్ని రోజులు ఇన్‌టైమ్‌కు, ఔట్ టైమ్‌కు మధ్య 3 నుంచి 5 నిమిషాలు వ్యత్యాసం ఉంది. మరి కొన్ని రోజులు అవుట్ టైమ్ లేకపోవడం గమనార్హం. వాస్తవానికి ఇన్‌టైమ్‌కు, అవుట్ టైమ్‌కు మధ్య 8 గంటలు తేడా ఉండాలి. కానీ అలా కాకుండా హాజరు నమోదై ఉంది. అలాగే ముఖ హాజరుకు, హాజరు పట్టీకి కూడా తీవ్ర వ్యత్యాసాలున్నాయి. ముఖ హాజరులో హాజరైనట్టు నమోదు కాగా, హాజరు పట్టీలో సంతకాలు లేకపోవడం వంటివి జరిగాయి. ఈ హాజరు ఆధారంగా జీతాలు ఇవ్వాల్సి ఉండగా నర్సింగ్ సూపరింటెండెంట్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వీటిని పరిశీలించకుండా జీతాలు మంజూరు చేసేశారు. ఈ విషయాలను డీఎంఈకి కొందరు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర స్థాయిలో పరిశీలన జరిపి వాస్తవమని గుర్తించి జిల్లా అధికారులను పూర్తి వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా ఈ ముగ్గురు స్టాఫ్‌నర్సుల్లో ఒకరు అధికారులపైన, కథనాల రాస్తున్న పత్రికా ప్రతినిధులపైన చిందులు తొక్కుతున్నారు. అధికారుల హాజరు వివరాలు కూడా తీయిస్తానని, కోర్టులో కేసులు వేస్తానని బెదిరిస్తున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రిమ్స్ అధికారులు లోతుగా విచారణ జరిపి అన్ని ఆధారాలతో డీఎంఈకి నివేదించాలని నిర్ణయించారు.

నేడు పూర్తిస్థాయి విచారణ

డీఎంఈ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం ప్రాథమికంగా హాజరును తనిఖీ చేశాం. సూపరింటెండెంట్ అత్యవసర పనిపై విజయనగరం వెళ్లడం వల్ల బుధవారం పూర్తి స్థాయిలో విచారణ జరుపుతాం. ఎవరి బెదిరింపులకూ బెదిరేది లేదు. నివేదికను రాష్ట్ర స్థాయికి రెండు మూడు రోజుల్లో సూపరింటెండెంట్ పంపిస్తారు.

– లుకలాపు ప్రసన్నకుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్

జేఈఈ మెయిన్స్‌లో సిక్కోలు జోరు



సంచాన అజయ్ కుమార్



కొత్తకోట జీవన్‌కుమార్



గురుగుబెల్లి అరవింద్



వద్దాది సంప్రీత్

శ్రీకాకుళం న్యూకాలనీ: జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో జిల్లా విద్యార్థులు జోరు కనబర్చారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు పరీక్షలు జరగ్గా జిల్లా నుంచి సుమారు 6వేల మంది హాజరయ్యారు. వారం రోజుల వ్యవధిలోనే మంగళవారం ఫలితాలు విడుదలయ్యాయి. కాగా జేఈఈ మెయిన్స్ 2వ విడత రిజిస్ట్రేషన్ల కోసం ఈ నెల 7 నుంచి రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టారు. మార్చి 7వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఏప్రిల్ 6 నుంచి 12వ తేదీ వరకు రెండో విడత పరీక్షల అనంతరం మెయిన్స్ తుది ఫలితాలు వెల్లడిచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా టాపర్‌గా అరవింద్..

శ్రీకాకుళంలోని బలగ(స్వగ్రామం వాల్తేరు)కు చెందిన గురుగుబెల్లి అరవింద్ 99.72 పర్సంటైల్ మార్కులతో జేఈఈ మెయిన్స్ జిల్లా టాపర్‌గా నిలిచాడు. శ్రీకాకుళం నగరానికి చెందిన వద్దాది సంప్రీత్ 99.66 పెర్సంటైల్ మార్కులతో సత్తాచాటాడు. శ్రీకాకుళానికే చెందిన కొఠారి భవేష్‌భార్గవ్ 99.309 పెర్సంటైల్, దేవాన్ష్ నాయక్ 98.509 పెర్సంటైల్, సుంకర రోహిత్ 98.31 పెర్సంటైల్‌తో ప్రతిభ కనబరిచారు. ఇందులో అరవింద్ మినహా మిగిలిన వారంతా శ్రీకాకుళం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. వీరిని కళాశాల ఏజీఎం నర్సునాయుడు, డీన్ మురళీధర్, ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ, ఏవో బుజ్జిబాబు అభినందించారు.

పాతపట్నం: జాతీయ స్థాయిలో మంగళవారం విడుదలైన జాయింట్ ఎంట్రాన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)–2023 (మెయిన్) ఫలితాల్లో పాతపట్నం విద్యార్థి సంచాన అజయ్‌కుమార్ సత్తాచాటాడు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో కలిపి 99.7 శాతం మార్కులతో ప్రతిభ కనబరిచాడు. తండ్రి సంచాన సంఘమేశు హిరమండలం మండలంలోని భగీరథపురంలో ఉపాధ్యాయుడిగా, తల్లి సంచాన ప్రమీల రాణి సారవకోట మండలం పెద్దలంబలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అజయ్‌కుమార్ పాతపట్నం సెయింటాన్స్ పాఠశాలలో ఐదో తరగతి వరకు, వెన్నెవలసలో నవోదయలో పదో తరగతి చదివాడు. విశాఖపట్నం నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు.

కంచిలి: మండల కేంద్రం కంచిలికి చెందిన కొత్తకోట జీవన్‌కుమార్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో కలిపి 98.86 శాతం మార్కులు సాధించాడు. దీంతో జీవన్ తల్లిదండ్రులు నాగరాజు, వసంత సంతోషం వ్యక్తంచేశారు.

చౌదరి బాబ్జీపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఎచ్చెర్ల క్యాంపస్: టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి (బాబ్జీ)పై ఎస్ఎంపురం గ్రామానికి చెందిన చౌదరి విజయలక్ష్మి, సువ్వారి రాజ్యలక్ష్మి, బొడ్డేపల్లి భారతి, నంబాళ్ల నాగమణి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్, ఎచ్చెర్ల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నంబర్ 112 –3లో డీపట్టా భూమి 50 సెంట్లు తమ కుటుంబ సభ్యులకు ఉందన్నారు. దానిని తమతో పాటు తమ్ముడు రామకృష్ణ సాగు చేస్తున్నారని, వారసత్వంగా వచ్చిన తమ ఆస్తిని సర్వే చేసి ధ్రువీకరించాలని కోరారు. తమ సోదరుడు రామకృష్ణ బాబ్జీ వియ్యంకుడని, అందుకే ఈ 50 సెంట్ల స్థలాన్ని బాబ్జీ కుమారుడు, రామకృష్ణ అల్లుడైన అవినాష్‌కి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. భూమితో సంబంధం లేని చౌదరి సంధ్యా గజపతిరావును భూమి ఆక్రమించుకున్నట్లు బాబ్జీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు తమకు న్యాయం చేయాలని విన్నవించారు.